

16న సాలూరులో జిల్లాస్థాయి పీజీఆర్ఎస్


పార్వతీపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను సోమవారం సాలూరులో నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాలూరు ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి పీజీఆర్ఎస్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. జిల్లా అధికారులంతా తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు.

తల్లికి వందనం.. కుటుంబాల్లో ఆనందం

- తల్లికి వందనం పథకం కింద నగదు జమ
- ఒక్కో కుటుంబంలో నలుగురు నుంచి ముగ్గురు పిల్లలకూ లబ్ధి
- ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్న తల్లులు
- ఇచ్చిన హామీని నెరవేర్చిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

పార్వతీపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో మరొక కీలక పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. 'తల్లికి వందనం' పేరిట శుక్రవారం తల్లుల ఖాతాలకు నగదు జమ చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఇంటికి కేవలం ఒక విద్యార్థికి మాత్రమే అమ్మఒడి పథకం వర్తింపజేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇంట్లో ఎంతమంది చదివితే అందరికీ పథకం వర్తింపజేసింది. పాఠశాలల పునఃప్రారంభం నాటికే నగదు జమ చేయడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవు తున్నాయి. ఇద్దరే కాదు నలుగురు పిల్లలున్నా కూడా ఒక్కొక్కరికీ రూ.13 వేల చొప్పున అందించారు. దీంతో తల్లులు సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. సీఎం చంద్రబాబు నాయుడు మేలు మరువలేమన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా జిల్లాలో 1,08,951 మంది విద్యార్థులు ఈ పథకానికి అర్హులుగా గుర్తించారు. ఈ మేరకు 69,600 తల్లుల బ్యాంకు ఖాతాలకు నగదు జమలు ప్రారంభ మయ్యాయి. జిల్లాలో నలుగురు పిల్లలున్న వారికి రూ.52 వేలు చొప్పున, ముగ్గురు సంతానం ఉన్నవారికి రూ.39 వేలు, ఇద్దరు పిల్లలున్న వారికి రూ.26 వేలు చొప్పున నగదు జమైంది. దీంతో తల్లుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. జిల్లాలోని ముగ్గురు పిల్లలు ఉన్న తల్లులు 4,170 మంది వరకు ఉన్నారు. వాస్తవంగా తల్లికి వందనం పథకం కింద ప్రతి ఒక్క విద్యార్థికి రూ.15 వేలు అందజేయాల్సి ఉండగా..

(మిగతా 8వ పేజీలో...)



ముగ్గురు పిల్లలతో తల్లి ఊర్మిళ

చెప్పినట్టే ఇచ్చారు..

కురుపాం రూరల్, జూన్13(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం మొండెంఖల్ గ్రామానికి చెందిన కుమ్మరి శివన్నారాయణ, ఊర్మిళ దంపతులకు ముగ్గురు సంతానం. వారి పెద్ద కుమారుడు జశ్వంత్ బొబ్బిలిలో 8వ తరగతి, దీక్షిత మొండెంఖల్‌లో 5వ తరగతి, శేషగిరి అదే గ్రామంలో 3వ తరగతి చదువుతున్నారు. తల్లికి వందనం పథకంలో భాగంగా ఊర్మిళ ఖాతాలో శుక్రవారం రూ. 39 వేలు జమ అయ్యాయి. దీంతో ఊర్మిళ ఆనందం వ్యక్తం చేశారు. తమ పిల్లలను బాగా చదివించేందుకు ఈ డబ్బులు ఎంతగానో దోహదపడతాయని ఆమె తెలిపింది. ' ప్రభుత్వం ఇచ్చిన మాట నిలుపుకుంది. చాలా ఆనందంగా ఉంది. సీఎం చంద్రబాబు చెప్పిన విధంగానే ఇంట్లో ఎంతమంది చదువుకున్న పిల్లలుంటే అందరికీ పథకం వర్తింపజేశారు. ఆయన మేలు మరువలేం. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.' అని ఊర్మిళ తెలిపారు.





నలుగురు పిల్లలతో తల్లి లక్ష్మి

నలుగురికీ ఇచ్చారు..


సాలూరు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తోణాం పంచాయతీ కేంద్రంలో పూజారి లక్ష్మి, ఉదయ్ దంపతులకు నలుగురు పిల్లలు. సాలూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో వారు విద్యనభ్యసిస్తున్నారు. ఉదయ్ ఆటో మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. లక్ష్మి గృహిణిగా ఉంది. కాగా వారి పిల్లల్లో మహిమ ప్రసన్న 9వ తరగతి, హనీ 7వ తరగతి , జేమీమా 4వ తరగతి , బ్లేసన్ 2 వ తరగతి చదువు తున్నారు. తల్లికి వందనం పథకం కింద ఒక్కొ క్కరికి రూ. 13 వేల చొప్పున మొత్తంగా రూ. 52 వేలు బ్యాంకు ఖాతాలో జమైనట్లు ఆమె మొబైల్‌కు సందేశం వచ్చింది. దీంతో ఆమె ఆనందానికి అవధుల్లేవు. సీఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి లోకేష్ చెప్పినట్టే పిల్లలందరికీ 'తల్లికి వందనం' కింద డబ్బులు ఇచ్చారని తెలిపారు.

42 సార్లు రక్తదానం

- ఆదర్శంగా నిలుస్తున్న పాలకొండ వాసి మురళీకృష్ణ

పాలకొండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా 42 సార్లు రక్తదానం చేసి అందరి మన్ననలు అందు కుంటున్నారు ముంజి మురళీకృష్ణ. పాలకొండకు చెందిన ఆయన 2007లో వరంగల్‌లో క్రైట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న సమయంలో తొలిసారి రక్తదానం చేశారు. రెడ్ క్రాస్‌ని ఆదర్శంగా తీసుకొని క్రియా అనే ఆర్గనైజేషన్‌ను ప్రారంభించారు. ఈ సంస్థ ద్వారా ఆపదలో ఉన్న వందలాది మందికి ఆయన రక్తదానం చేశారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పాలకొండ ఏరియా ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ శిబిరంలో కూడా రక్తదానం చేస్తానని ఆయన వెల్లడించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని తెలిపారు. రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయనే అపోహలు వీడాలని సూచించారు. ఒకసారి శ్రీకాకుళానికి చెందిన ఒక వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలైతే.. తాను పాలకొండ నుంచి శ్రీకాకుళం వెళ్లి రక్తం దానం చేసినట్లు గుర్తు చేశారు. తాను చేసిన సేవలకు రెడ్ క్రాస్ సొసైటీ , అప్పటి శ్రీకాకుళం కలెక్టర్ సౌరబ్‌గౌర్ , ఇటీవల పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు పొందినట్లు తెలిపారు. రక్తదానానికి ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

నేడు 'ప్రపంచ రక్తదాతల దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనాలు.. 6లో



రక్తదానం చేస్తున్న మురళీకృష్ణ (ఫైల్)

బదిలీల జాతర

- తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లకు స్థానచలనం
- ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్



పార్వతీపురం/ గరుగుబిల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. విజయనగరం జిల్లా భోగాపురంలో పనిచేస్తున్న ఎం.సురేష్‌ను పార్వతీపురం తహసీల్దార్‌గా, పాలకొండ తహసీల్దార్ ఆర్.మురళీకృష్ణను బలిజిపేటకు, కొత్తవలస తహసీల్దార్ బి.నీలకంఠరావును సాలూరుకు బదిలీ చేశారు. మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని హెచ్ సెక్షన్‌లో పనిచేస్తున్న కె.జయను కురుపాం తహసీల్దార్‌గా, ఎల్.కోట తహసీల్దార్ డీఎంజీఎస్ ప్రసాద్‌ను మక్కువకు, పార్వతీపురం తహసీల్దార్ వై.జయలక్ష్మిని జియ్యమ్మ వలసకు, కొమరాడ తహసీల్దార్ ఎ.సాయికామేశ్వర రావును వీరఘట్టం మండలానికి, మన్యం జిల్లా కలెక్టరేట్ లోని సీ-సెక్షన్‌లో పనిస్తున్న సీహెచ్ రాధాకృష్ణ మూర్తిని పాలకొండకు, గుమ్మలక్ష్మీపురం తహసీల్దార్ ఎన్.శివన్నారాయణను భామినికి, జియ్యమ్మవలస తహసీల్దార్ ఎన్.చిన్నా రావును కలెక్టరేట్ ఏవోగా స్థానచలనం కల్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా 28 మంది ఉప తహసీల్దార్లనూ పలుచోట్లకు బదిలీ చేశారు.

భర్త, కోడలు విద్యుదాఘాతానికి గురయ్యారని..

- ఆందోళనతో మహిళ హఠాన్మరణం
- భామిని మండలం వడ్డంగిలో ఘటన

7లో

18న సాలూరు ఐటీఐలో జాబ్‌మేళా

8లో

ఏగోటి వలసలో ఏనుగులు

- భయాందోళనలో గ్రామస్థులు

యోగాపై చిత్రలేఖన పోటీలు

- పర్యవేక్షించిన డీఎంహెచ్‌వో భాస్కరరావు

8లో

3,800 ప్రదేశాల్లో యోగాంధ్ర

- నేడు జిల్లావ్యాప్తంగా నిర్వహణ
- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 3,800 ప్రదేశాల్లో శనివారం పెద్దఎత్తున యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రజలు పెద్దఎత్తున పేర్లు నమోదు చేసుకోవడం శుభపరిణామమన్నారు. భారీగా చేపట్టే ఈ కార్యక్రమానికి సంబంధించి పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఎంపీడీవోలు, ఇతర అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, అన్ని శాఖల సిబ్బంది పాల్గొనేలా చూడాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, గర్భిణులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు ఈ కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు. ఈ నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సన్నద్ధం కావాలని ఆదేశించారు.

రేపటి నుంచి డీఏ జుగా గ్రామసభలు...

ధర్తి అబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ కింద జూన్ 15 నుంచి 30వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు షెడ్యూల్ తయారు చేసి ఆయా గ్రామాలకు ముందుగానే సమాచారం అందించాలన్నారు. ఇప్పటికే సర్వేల ద్వారా ప్రజల అవసరాలకు గుర్తించామని వెల్లడించారు. సీఎం సూర్యఘర్ లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో అవగాహనా కార్యక్రమాలు ఇంకా విస్తృతం చేయాలన్నారు. సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామసభలకు సంబంధించి విధి విధానాలను రూపొందించామన్నారు. ప్రతి గిరిజనుడికి లబ్ధి చేకూరేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. డీఆర్వో హేమలత తదితరులు పాల్గొన్నారు.



ఆగుతూ... సాగుతూ..

- ప్రహసనంగా టీచర్ల బదిలీల ప్రక్రియ

విజయనగరం కలెక్టరేట్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు బదిలీల ప్రక్రియ మూడో రోజు శుక్రవారం ఆగుతూ... సాగుతూ నడిచింది. క్లస్టర్ ఖాళీలను చూపించాలంటూ ఉపాధ్యాయులు డిమాండ్ చేయడంతో కౌన్సెలింగ్ ప్రక్రియ కొన్ని గంటల పాటు నిలిచిపోయింది. తిరిగి రాత్రి 10.20కు ప్రారంభించారు. శుక్రవారం ఉదయం 1000 సీరియల్ నుంచి ప్రక్రియ మొదలు పెట్టారు. రాత్రి 7.30 గంటలకు 1405 నంబర్ వరకూ కౌన్సెలింగ్ నిర్వహించారు. రాత్రి 8 గంటల నాటికి రెగ్యులర్ ఖాళీలు పూర్తి కావడంతో క్లస్టర్ ఖాళీలు చూపించాలంటూ ఉపాధ్యాయులు కోరారు. దీంతో మరోసారి తాత్కాలికంగా ప్రక్రియ నిలిచింది. ఇంకా పెండింగ్‌లో 796 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో 152 మందిని తప్పకుండా బదిలీ చేయాల్సి ఉంది. మిగిలిన వారు రిక్వెస్టుపై దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతానికి కౌన్సెలింగ్ పూర్తియిందని, సీఎస్‌ఈ ఆదేశాల మేరకు క్లస్టర్ ఖాళీలను నింపే విధానంపై స్పష్టత వచ్చాక మళ్లీ పిలిచి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని డీఈవో మాణిక్యంనాయుడు వెల్లడించారు.



బదిలీల కోసం జడ్పీ కార్యాలయంలో నిరీక్షిస్తున్న ఉపాధ్యాయులు

మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయం

- సాలూరు నూతన కమిషనర్ జయరాం



సాలూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సాలూరు మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని నూతన కమిషనర్ సీపాన జయరాం తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో ముందుకెళ్తామన్నారు. ప్రజలు కూడా సహకరించాలన్నారు. కాగా విశాఖ జీవీఎంసీలో వెటర్నరీ సర్జన్‌గా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన డీటీవీ కృష్ణారావు జగ్గయ్యపేటకు బదిలీపై వెళ్లారు.

వంద పడకల ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకురండి

- ఉత్తరాంధ్ర అధ్యయన వేదిక డిమాండ్

8లో

మినీ రిజర్వాయర్ నిర్మిస్తే సస్యశ్యామలమే..

- రాళ్లగెడ్డపై మినీ రిజర్వాయర్ నిర్మాణానికి గిరిజన రైతుల ఎదురుచూపు
- పూడికలతో నిండిన కాలువలు
- పది వేల ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకం
- ప్రతిపాదనలు పంపినా స్పందించని గత వైసీపీ సర్కారు
- రాష్ట్ర ప్రభుత్వంపైనే ఆశలు

జియ్యమ్మవలస, జూన్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు మండలాల పరిధిలో ఉన్న రాళ్లగెడ్డ మినీ రిజర్వాయర్ నిర్మాణం కలగా మారింది. సుమారు పది వేల ఎకరాలకు సాగునీరందించే సామర్థ్యం ఉన్నా.. దానిని పట్టించుకునే వారే కరువయ్యారు. దీని నిర్మాణం కోసం తూర్పు ఏజెన్సీ ప్రాంత రైతులు కొన్నేళ్లుగా ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. గతంలో ఎన్నోసార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి ఈ విషయం తీసుకెళ్లినా ఎటువంటి ప్రయోజనం లేకపోయింది. వైసీపీ సర్కారు కనీసం కాలువల నిర్వహణకు కూడా నిధులు మంజూరు చేయలేదు. సుమారు రూ.2కోట్లతో అప్పట్లో అధికారులు ప్రతిపాదనలు పంపినా వైసీపీ స్పందించలేదు. దీంతో గిరిజన

(మిగతా 8వ పేజీలో...)



కల్వర్టు వద్ద పరిస్థితి ఇదీ..



మినీ రిజర్వాయర్ నిర్మించాల్సిన మానాపురం, తాడిపాయి గ్రామాల మధ్య కొండలు ఇవే..

ప్రపంచంలో వైద్యరంగం సరికొత్త పుంతలు తొక్కుతున్నా.. నిపుణులు తయారు చేయలేని పదార్థాల్లో రక్తం ఒకటి. మనదేశంలో ఉన్న 140 కోట్ల మంది జనాభాను అత్యవసర సమయాల్లో రక్షించుకునేందుకు ఏటా సుమారు ఐదు కోట్ల యూనిట్ల రక్తం అవసరం అవుతోంది. కానీ, అందుబాటులో ఉన్నది కేవలం 50 లక్షల యూనిట్లు మాత్రమే. అందుకే అత్యవసర సమయాల్లో, ఆపదకాలంలో రక్తం అందక ఎంతో మంది మృత్యువాతపడుతున్నారు. రక్తదానంపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు పెరగాల్సిన అవసరం ఉంది. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

ఒకరి రక్తం.. నలుగురికి ప్రాణాధారం

- రక్తదానం మహోన్నతం
- అవగాహన లేక ముందుకురాని దాతలు
- ఆరోగ్యవంతులు ఎన్నిసార్లయినా చేయవచ్చు
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

రాజాం/రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి)

ఒక వ్యక్తి రక్తం దానం చేస్తే నలుగురి ప్రాణాలను నిలబెట్టవచ్చు. దాత నుంచి సేకరించిన రక్తాన్ని హోల్ బ్లడ్ అంటారు. ఆ రక్తంలో ప్లాస్మా, ప్లేట్‌లెట్స్, ఎర్ర రక్త కణాలు, తెల్ల రక్తకణాలు ఉంటాయి. వీటిని విడదీసి నలుగురికి ఎక్కించవచ్చు. ఒక వ్యక్తి ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు. ప్రతి 15 రోజులకు ఒక సారి ప్లాస్మాతో పాటు ప్లేట్‌లెట్స్ సైతం దానం చేయవచ్చు అని నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్యంగా ఉన్న 18 సంవత్సరాలు నిండిన వారు రక్తదానం చేయవచ్చు. 18ఏళ్ల నుంచి క్రమం తప్పకుండా రక్తదానం చేస్తే జీవితకాలంలో దాదాపుగా 168 సార్లు రక్తదానం చేయవచ్చు అని నిపుణులు చెబుతున్నారు. బరువు 45 కిలోలు పైబడిన వారు, బీపీ అదుపులో ఉన్నవారు రక్తదానం చేయవచ్చు. తీవ్రమైన వ్యాధులు, మూర్ఛ, మూత్రపిండ వ్యాధిగ్రస్తులు, అలర్జీ ఉన్నవారు, అసాధారణ రక్తప్రసరణ లక్షణాలు, త్వరితగతిన బరువు కోల్పోవడం, హృదయ సంబంధ వ్యాధిగ్రస్థులు, ఇతర ప్రమాదకరమైన వ్యాధులు లేనివారు రక్తదానం చేయవచ్చు. రక్తదానం చేసినవారికి ఆరోగ్యపరంగా కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి. రక్తదానం వల్ల పెద్దపేగు, ఊపిరితిత్తులు, కాలేయం, గొంతు క్యాన్సర్ వచ్చే అవకాశం తగ్గుతుంది. గుండె సంబంధిత వ్యాధులు తగ్గుతాయి. రక్తదానంపై చాలా అపోహలు ఉంటాయి. రక్తదానం చేస్తే ఆరోగ్యం పూర్తిగా క్షీణిస్తుందని ఎక్కువ మంది భయపడుతుంటారు. కానీ, అటువంటిదేమీ ఉండదు. రక్తదానం చేసిన రెండురోజులకే దయనందిన పనుల్లో నిమగ్నం కావొచ్చు. రక్తదానం చేసే సమయంలో చిన్న సూది నొప్పి తప్పించి ఏ ఇబ్బంది ఉండదు. రక్తదాతకు ముందుగా వైద్య పరీక్షలు చేస్తారు. ఆయన శరీరంలో సరిపడినంత కంటే ఎక్కువ రక్తం ఉంటేనే సేకరిస్తారు. రక్తదానం తరువాత ఆరు వారాల్లోపు ఆ వ్యక్తి శరీరంలో కొత్త రక్తం తయారవుతుంది.

ప్రత్యేక యాప్..

రక్తదానం చేసేవారికి ప్రత్యేకంగా ఒక యాప్ అందుబాటులో ఉంది. జాతీయ ఆరోగ్య మిషన్ ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. 'ఈరక్తకోష్' అనే యాప్‌లో వివరాలు నమోదుచేసి రక్తం దానం చేయవచ్చు. మరోవైపు రెడ్‌క్రాస్ జిల్లా యూనిట్ల ద్వారా కూడా రక్తదానం చేయవచ్చు. ప్రతి జిల్లాలోనూ రెడ్‌క్రాస్ యూనిట్లు ఉంటాయి. అక్కడ ప్రతినిధులతో పాటు వలంటీర్లు ఉంటారు. వారిని సంప్రదించి రక్తదానం చేయవచ్చు. అయితే రక్తదానంపై రెడ్‌క్రాస్‌తో పాటు స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయి. కానీ, ఎందుకో ఆశించిన స్థాయిలో రక్తదానం చేసేందుకు దాతలు ముందు కు రావడం లేదు. జనాభాలో నూటికి 2 నుంచి 5 శాతం మంది మాత్రమే రక్తదానానికి ముందుకొస్తున్నారని గణాం కాలు చెబుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం ఈ విషయంలో పటిష్ఠ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రజలు కూడా స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేస్తే ఎంతో మంది విలువైన ప్రాణాలు నిలబెట్టవచ్చు.



రక్తదాన శిబిరం (ఫైల్)

విస్తృత అవగాహన..

జిల్లాలో అవసరానికి తగ్గట్టు రక్తసేకరణ ఆశించిన స్థాయిలో జరగడం లేదు. రెడ్‌క్రాస్ రక్తదానం విషయంలో విస్తృత అవగాహన చేపడుతోంది. రక్తదానంపై అవగాహన ఉన్నవారు మాత్రమే దానం చేస్తున్నారు. కొత్తవారు రావడం లేదు. రక్తదానంపై ప్రజల్లో ఉన్న అపోహలు పోవాలి. ఈ విషయంలో స్వచ్ఛంద సంస్థలు కృషిచేయాలి.

-ప్రసాదరావు, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్, విజయనగరం

విరివిగా శిబిరాలు..



జిల్లాలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా అన్ని కాలేజీ యాజమాన్యాలకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి. రక్తదాన శిబిరాలు తప్పనిసరి చేయాలి. అటు రక్తదానంపై ప్రభుత్వ శాఖలు కూడా పెద్ద ఎత్తున ప్రచారం చేయాలి. అప్పుడే రక్తదాతలు పెరిగే అవకాశం ఉంది. వందలు, వేల ప్రాణాలను నిలబెట్టగలం.

-పెంకి చైతన్యకుమార్, రెడ్‌క్రాస్ ప్రతినిధి, రాజాం

రక్తదానంలో అర్ధసెంచరీ..



చంద్రశేఖర్

గజపతినగరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిసిద్ధార్థ కళాశాల కరస్పాండెంట్ శీరం రెడ్డి చంద్రశేఖర్ ఇంతవరకు 52 పర్యాయాలు రక్తదానం చేశారు. గజపతినగరం నియోజకవర్గంలో ఎక్కడ రక్తదాన శిబిరాలు నిర్వహించినా రక్తదానం చేయడానికి ఆయన ముందుంటారు. తన కళాశాలలో ప్రతీ ఆరు నెలలకు ఒక పర్యాయం రక్తదాన శిబిరం నిర్వహిస్తుంటారు. ఇంతవరకు 35 శిబిరాలను నిర్వహించి 1650 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఇటీవల తన స్నేహితుడి భార్య డెలవరీ సమయంలో రక్తం సరిపోకపోతే విశాఖపట్నం వెళ్లిమరీ రక్తదానం చేశారు. దీంతో ఆమె ప్రసవం ప్రశాంతంగా జరిగి బిడ్డకు జన్మనిచ్చింది. ఆ అనుభూతిని ఎప్పటికీ మరిచిపోలేనని ఆయన తెలిపారు.

వెంటనే స్పందిస్తుంటా..



బొబ్బిలి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): 'నా బ్లడ్ గ్రూప్ బి.పాజిటివ్. 1989 లో నేను మొదటి సారి రక్తదానం చేశాను. ఈ ఏడాది ఫిబ్రవరిలో 89వ సారి దానం చేశాను. ఎక్కువగా మహిళలకు సంబంధించి అత్యవసర శస్త్రచికిత్సల సమయాల్లో రక్తం అవసరమైనప్పుడు హుటాహుటిన స్పందించి రక్తం అందిస్తున్నాను. నిడగల్లు హైస్కూల్‌లో పనిచేసినప్పుడు పార్వతీపురం ఆసుపత్రిలో ప్రసవవేదనకు గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ గర్భిణికి రక్తం దానం చేశాను. ఆమెకు విజయవంతంగా శస్త్రచికిత్స జరిగి బిడ్డను ప్రసవించింది. ఆమె కుటుంబ సభ్యులంతా నాకు కృతజ్ఞతలు చెప్పిన క్షణాలను ఎప్పటికీ మరువలేను. ఆ బిడ్డకు బారసాల సమయంలో నాతో నామకరణం చేయిడాన్ని వెలకట్టలేని కృతజ్ఞతగా భావిస్తున్నాను.

-మిండి విజయ్‌మోహన్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, పాతబొబ్బిలి

స్నేహితులతో కలిసి చేస్తుంటా..



నేను 18 ఏళ్ల వయసులో తొలిసారి రక్తదానం చేశాను. ఇప్పుడు నాకు 54 ఏళ్లు. ఇంతవరకు 37 సార్లు రక్తదానం చేశాను. మహిళల ప్రసవాలు, ఇతర ఆపరేషన్ల సమయంలో రక్తం అవసరం ఉంటుంది. అలాంటప్పుడు నేను, నా స్నేహితులు కలిసి వెళ్లి రక్తదానం చేస్తుంటాం.

-వడ్డాది మంగమ్మ, అంగన్వాడీ ఆయా, మల్లమ్మపేట, బొబ్బిలి

73 సార్లు రక్తదానం..



నెల్లిమర్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నేను ఇప్పటి వరకు 73 సార్లు రక్తదానం చేశా. నా బంధువైన ఆర్మీ జవాన్ రామచంద్రరావు సూచనలతో రక్తదానం చేయడాన్ని హాబీగా మార్చుకున్నా. రక్తం అవసరమని ఫోన్ వస్తే ఎంతదూరమైనా వెళ్తా. ఇటు విశాఖపట్నం, అటు శ్రీకాకుళం జిల్లాలో ఏ ప్రాంతానికైనా వెళ్తుంటా. ఇటీవలే ఓ గర్భిణికి ఓ నెగటివ్ రక్తం కావల్సివస్తే పలాస వెళ్లి దానం చేసి వచ్చా. ప్రస్తుతం నేను విజయనగరం కేంద్రీయ విద్యాలయంలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాను.

-అమర్నాథ్, కొండవెలగాడ, నెల్లిమర్ల



వాట్సాప్ గ్రూపు ద్వారా..

మాది బొబ్బిలి పట్టణం మల్లమ్మపేట గ్రామం. 2018లో ఇండియన్ బ్లడ్ బ్రదర్ అనే వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేశాం. ఈ గ్రూప్‌లో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 200మందికి పైగా రక్తదాతలు ఉన్నారు. ఎవరికి రక్తం అవసరమైనా వెంటనే గ్రూపులోని రక్తదాతలు ఆసుపత్రులకు చేరుకొని రక్తదానం చేస్తుంటారు. నేను(గణేష్) ఇంతవరకు సుమారు 30 సార్లు రక్తదానం చేశాను. తలసేమియా రోగులకు పెద్దఎత్తున రక్తదానం చేస్తున్నాం.

-మల్లెపు గణేశ్, తీగల హరికృష్ణ, ఇండియన్ బ్లడ్ బ్రదర్ గ్రూపు ప్రతినిధులు

రక్తం విలువ తెలుసు..



2009లో మా అక్క ఆరోగ్య పరిస్థితి బాగులేక శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. రెండు బాటిల్స్ రక్తం అవసరమని వైద్యులు సూచించారు. ఎక్కడా లభ్యం కాలేదు. ఆఖరికి విశాఖలోని ఓ ప్రైవేటు బ్లడ్‌బ్యాంక్ నుంచి రక్తం తెచ్చి ప్రాణాలు కాపాడుకున్నాం. రక్తం విలువ అప్పుడు నాకు తెలిసింది. 2010 ఏప్రిల్‌లో శ్రీకాకుళంలో ఐటీఐ చదువుతున్నపుడు ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో నేను రక్తదానం చేశాను. ఈనెల 1న నా పుట్టినరోజు సందర్భంగా 55వ సారి జిల్లా కేంద్రంలోని బ్లడ్‌బ్యాంక్‌కు వెళ్లి రక్తదానం చేశాను. నాది ఓ పాజిటివ్ గ్రూపు. రాష్ట్ర గవర్నర్ సంతకం చేసి ఉన్న సర్టిఫికెట్ పొందడం నాజీవితంలో మరచిపోలేనిది.

-శనపతి రాము, పొగిరి, రాజాం

అమ్మ ఆనందం

- బ్యాంకు ఖాతాల్లో తల్లికి వందనం నిధులు
- ఒక్కొక్కరికీ రూ.13 వేల చొప్పున జమ
- టీడీపీ ఎన్నికల హామీ అమలు
- పేదల ఇళ్లలో సందడే సందడి

రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా 'తల్లికి వందనం' పేరిట శుక్రవారం తల్లుల ఖాతాలకు నగదు జమ చేసింది. సీఎం చంద్రబాబు చెప్పినట్టుగానే ఇంట్లో ఎంతమంది చదువుకుంటే అంతమందికీ తల్లికి వందనం వర్తింపజేశారు. ఇద్దరే కాదు నలుగురు పిల్లలున్నా కూడా ఒక్కొక్కరికీ రూ.13 వేల చొప్పున అందించారు. దీంతో తల్లుల ఆనందానికి అవధుల్లేవు. 'తల్లికి వందనం' పథకంపై వారి మాటల్లోనే..

హామీ నెరవేర్చారు..



వండువ గ్రామానికి చెందిన చల్ల జయలక్ష్మి, పిల్లలు

వీరఘట్టం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం మండలం పరిధి వండువ గ్రామంలోని చల్ల జయలక్ష్మి, గౌరునాయుడు దంపతులకు ముగ్గురు సంతానం. వారి పిల్లలు చల్ల ఆశ్లేష పదో తరగతి, చైతన్యనాయుడు ఎనిమిదో తరగతి, మహీదర్‌నాయుడు ఆరో తరగతి చదువుతున్నారు. వండువ గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. 'తల్లికి వందనం' పథకం కింద తన ముగ్గురు పిల్లలకు రూ.39 వేలు జమ కావడంతో జయలక్ష్మి సంతోషం వ్యక్తం చేశారు. 'గత ప్రభుత్వంలో ఒకరికి మాత్రమే డబ్బులు పడేవి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ముగ్గురు పిల్లలకు డబ్బులు జమ చేసింది. సీఎం చంద్రబాబు రుణం తీర్చుకోలేనిది.' అని ఆమె తెలిపారు.

చంద్రబాబు మేలు మరువలేం..



గొట్టివలసలో ముగ్గురికీ తల్లికి వందనం జమ కావడంతో కుటుంబంలో ఆనందం

గరుగుబిల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గొట్టివలసకు చెందిన అజ్జరాపు అప్పలరాజు, భారతి దంపతులకు ముగ్గురు సంతానం. వారిలో ఉద్దవ్ 7వ తరగతి, ధనుష్ 6వ తరగతి, ధనుషా 6వ తరగతి చదువుతున్నారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. అర్హులైన జాబితా గురువారం ప్రకటించగా శుక్రవారం భారతి బ్యాంకు ఖాతాలో రూ.39 వేలు జమైంది. ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చడంతో ఆమె ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యింది. సీఎం చంద్రబాబుకు ఆ కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేలు మరువలేమన్నారు.

మాట నిలబెట్టుకున్నారు..



డబ్బులు జమైనట్టు చెబుతున్న కూనంబందవలసకు చెందిన కోట కనకదుర్గ

సాలూరు రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పాచిపెంట మండలం కూనంబందవలస గ్రామానికి చెందిన కోట కనకదుర్గ, సోములుకు ముగ్గురు సంతానం. సోములు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా వారి పిల్లల్లో సమీర (7వ తరగతి) పాచిపెంట కేజీబీవీలో చదువుతుంది. హాసిని (4వ తరగతి), హర్షిణి (4వ తరగతి) కూనంబందవలసలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. ఒక్కొక్కరికి రూ. 13 వేల చొప్పున రూ. 39 వేలు బ్యాంక్‌ఖాతాలో జమ అయినట్టు మొబైల్‌కు సమాచారం వచ్చింది. దీంతో కనకదుర్గ ఆనందం వ్యక్తం చేసింది. సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌లు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని తెలిపారు.

పాలవలసలో..



తమ్ముడితో చాందిని, మోక్షిత

గుర్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పాలవలస గ్రామానికి చెందిన వల్లూరి భానుకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. గ్రామంలోని పాఠశాలలో పెద్ద కుమార్తె చాందిని నాలుగో తరగతి, రెండో కుమార్తె మోక్షిత రెండు తరగతి చదువుతున్నారు. తల్లికి వందనం పథకం తమ ఇద్దరు పిల్లలకు వర్తించిందని, రూ.13వేలు చొప్పున రూ.26వేలు తన బ్యాంకు ఖాతాలో జమైనట్లు భాను తెలిపారు. కుమారుడు ప్రస్తుతం అంగన్‌వాడీలో చదువుతున్నాడని, మరో వారం రోజుల్లో బాబును కూడా ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తానని చెప్పారు.

ఎల్‌ఎన్‌పురంలో..



పిల్లలతో ఉష

పార్వతీపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌ఎన్‌పురం గ్రామానికి చెందిన జి.ఉషకు ఇద్దరు సంతానం. ఆమె ఇద్దరి పిల్లలకు తల్లికి వందనం పథకం మంజూరైనట్టు జాబితాలో పేర్లు ఉన్నాయి. గతంలో తన పిల్లల్లో ఒకరికి మా త్రమే నగదు జమ అయింది. ఇప్పుడు ఇద్దరు పిల్లలకు రూ.26 వేలు జమకానుండడం ఆనందంగా ఉంది.

ప్రభుత్వానికి ధన్యవాదాలు..



కుమారులతో లావణ్య

మక్కువ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెముడు గ్రామానికి చెందిన మూడడ్ల లావణ్య పిల్లలు బొబ్బిలి పట్టణంలోని భాష్యం స్కూల్‌లో చదువుతున్నారు. పెద్ద కుమారుడు భార్గవనాయుడు ఏడో తరగతి, చిన్నకుమారుడు మణికంఠ ఐదో తరగతి చదువుతున్నారు. వీరికి సంబంధించి లావణ్య బ్యాంకు ఖాతాకు రూ.26 వేలు నగదు జమైంది. దీంతో కూటమి ప్రభుత్వానికి ఆమె ధన్యవాదాలు తెలిపారు.

ముస్లిం మహిళకు..



బొబ్బిలిలో నిరుపేద ముస్లిం తల్లీపిల్లలు

బొబ్బిలి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణ పరిధిలోని 30వ వార్డు ముస్లింవీధికి చెందిన షేక్ ముంతాజ్ ఖాతాకు తల్లికి వందనం పథకంలో భాగంగా తన ఇద్దరి పిల్లల పేరున డబ్బులు జమయ్యాయి. భర్త నుంచి దూరంగా ఉంటున్న ఆమె ఇళ్లల్లో పనిచేసుకుంటూ ఇద్దరు పిల్లలను పెంచుతోంది. పెద్ద కుమార్తె షేక్ ప్యారీ 5వ తరగతి, చిన్న కుమార్తె షేక్ గుల్షన్ రెండో తరగతి చదువుతోంది. తల్లికి వందనం పథకం కింద జమైన రూ.26 వేలను ఇద్దరి పిల్లల చదువుకోసం ఉపయోగిస్తానని తెలిపింది.

అనూరాధ కుటుంబానికి..

బొబ్బిలి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి సాయినగర్‌కు చెందిన శ్రీనివాసరావు, అనూరాధ దంపతులు కూలి పని చేస్తుంటారు. వీరి కుమార్తె సాయిసాహితీ 9వ తరగతి, కుమారు డు మహీధర్ 5వ తరగతి చదువుతున్నారు. వీరిద్దరి పేరున తల్లికివందనం పథకం నిధులు శుక్రవారం జమ అయ్యాయి. తమ లాంటి నిరుపేద కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం ఎంతో చేయూత ఇస్తుందని, పిల్లల భవిష్యత్‌కు భరోసాగా ఉంటుందన్నారు.



పిల్లలతో శ్రీనివాసరావు, అనూరాధ దంపతులు

డీసీసీబీ అభివృద్ధికి సహకరించండి

- చైర్మన్ కిమిడి నాగార్జున



ఆప్కాబ్ ఎండీ శ్రీనాథ్‌రెడ్డిని కలిసిన డీసీసీబీ చైర్మన్ నాగార్జున

విజయనగరం రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) అభివృద్ధికి సహకరించాలని ఆ బ్యాంకు చైర్మన్ కిమిడి నాగార్జున ఆప్కాబ్ రాష్ట్ర ఎండీ శ్రీనాథ్‌రెడ్డిని కోరారు. డీసీసీబీ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన శుక్రవారం అమరావతిలోని ఆప్కాబ్ కార్యాలయానికి వెళ్లి ఎండీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ.. ఉమ్మడి విజయనగరం జిల్లాలో రైతాంగం ఎక్కువగా ఉందని, వ్యవసాయాధారిత ప్రాంతం కావడంతో ఖరీఫ్‌నకు విస్తృతంగా రుణాలు ఇవ్వాల్సి ఉందన్నారు. అదే విధంగా ప్రధానమంత్రి ముఫ్తీ బిజిలీ యోజన కింద రూ.10 కోట్లు ఇవ్వాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సూర్య ఘర్ యోజన కింద రూ.10 కోట్లు రుణాలు ఇచ్చేందుకు సహకరించాలని కోరారు. ఈ ఏడాది రూ.2,500 కోట్లు వ్యాపారం లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఎండీ శ్రీనాథ్‌రెడ్డి..నాగార్జునను శాలువాతో సత్కరించారు.

ఉప తహసీల్దార్లకు స్థానచలనం

- ఆదేశాలు జారీ చేసిన జాయింట్ కలెక్టర్

గరుగుబిల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లాలో డిప్యూటీ తహసీల్దార్లకు స్థానచలనం అయింది. ఈ మేరకు బలిజిపేటలో పనిచేస్తున్న కె.రత్నకుమారిని పార్వతీపురానికి, పాచిపెంటలో ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న పి.పైడిరాజును మక్కువ ఉప తహసీల్దార్‌గా, మక్కువ ఉప తహసీల్దార్ షేక్ ఇబ్రహీంను పార్వతీపురం సీఎస్‌డీటీగా, మక్కువలో ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జిగా ఉన్న ఎస్.వీరాంజనేయులను పార్వతీపురం డీఎం సివిల్ సప్లయ్ కార్యాలయానికి పంపించారు. పార్వతీపురం ఐటీడీఏలో స్పెషల్ డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న కె.సూర్యారావును పార్వతీపురం ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జిగా నియమించారు. కురుపాం సీఎస్‌డీటీ కె.శ్రీనివాసరావును బలిజిపేట తహసీల్దార్ కార్యాలయానికి, సాలూరు డీటీ కె.భానుప్రసాద్‌ను బలిజిపేటకు, పాచిపెంట సీఎస్‌డీటీ ఆర్.నరేష్‌బాబును సాలూరుకు, పార్వతీపురం సీఎస్‌డీటీ పి.కిరిటీని సాలూరుకు స్థానచలనం కల్పించారు. వేపాడ సీఎస్‌డీటీ కె.సన్యాసినాయుడును సాలూరుకు, సీతంపేట సీఎస్‌డీటీ కె.మధుసూదనరావును మక్కువ ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు, సాలూరు సీఎస్‌డీటీ వి.రంగారావును పాచిపెంటకు, కొమరాడ ఆర్‌ఎస్‌డీటీ జి.హేమంత్‌ను పాచిపెంటకు, పాచిపెంట సీఎస్‌డీటీ జి.చంద్రశేఖర్‌ను పాచిపెంట ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జిగా బదిలీ చేశారు. ఎల్విన్‌పేట సీఎస్‌డీటీ ఎ.సాంబమూర్తిని కురుపాంకు, పార్వతీపురం సీఎస్‌డీటీ ఎం.రాజేంద్రను గరుగుబిల్లికి, సీతం పేట ఐటీడీఏలో విధులు నిర్వహిస్తున్న ఎస్.వెంకటరావును గరుగుబిల్లి ఆర్‌ఎస్‌డీటీగా నియమించారు. వీరఘట్టం సీఎస్‌డీటీ సీహెచ్ సత్యనారాయణను కొమరాడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా, జియ్యమ్మవలస సీఎస్‌డీటీ ఆర్.పకీరునాయుడును కొమరాడకు, కొమరాడ సీఎస్‌డీటీ వై.కిరణ్‌కుమార్‌ను జియ్యమ్మవలస కు, కొమరాడలో విధులు నిర్వహిస్తున్న కె.శివయ్యను జియ్యమ్మవలస సీఎస్‌డీటీగా బదిలీ చేశారు. పార్వతీపురం ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జిగా ఉన్న పి.శ్రీనివాసరావును ఎల్విన్‌పేటకు, పాలకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలో పనిస్తున్న బి.స్వర్ణలతను పాలకొండ ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జిగా, పార్వతీపురంలో ఎన్నికల ఉప తహసీల్దార్‌గా ఉన్న కె.కవితను వీరఘట్టానికి, పాలకొండ సీఎస్‌డీటీ ఇ.మల్లేశ్వరరావును సీతంపేటకు, ఎస్.కోట సీఎస్‌టీడీ కె.భరత్‌కుమార్‌ను ఎల్విన్‌పేటకు, సాలూరు సీఎస్‌డీటీ బి.రాజశేఖర్‌ను కురుపానికి, పాలకొండ ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జిగా ఉన్న బి.ప్రసాదరావును సీతంపేట ఐటీడీఏకు బదిలీ చేస్తూ జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిత ఆదేశాలు జారీ చేశారు.

కూరగాయల మార్కెట్‌లో..

దళారుల హవా?

● రైతులు నేరుగా కూరగాయలు అమ్ముకోలేని దుస్థితి ● పట్టించుకోని అధికారులు

గజపతినగరం, జూన్13 (ఆంధ్రజ్యోతి): గజపతి నగరంలోని కూరగాయల మార్కెట్‌లో దళారుల హవా కొనసాగుతోంది. రైతులే తమకు నచ్చిన ధరకు అమ్ముకుని లాభసాటిగా ఉండేలా వ్యవసాయ మార్కెట్ ఆవరణలో రైతుబజార్‌ను గతంలో టీడీపీ ఏర్పాటు చేసింది. అందుకు అప్పట్లో రూ.2 లక్షల వ్యయంతో కూరగాయలు నిల్వకు షెడ్‌లతో పాటు మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం కల్పించారు. గజపతినగరం మండలంతో పాటు చుట్టు పక్కల దత్తిరాజేరు, బొండపల్లి, మెంటాడ మండలాల నుంచి కూరగాయలను మార్కెట్‌కు రైతులకు తీసుకువచ్చి అమ్మకాలు చేసేవారు. దాంతో పేద, మధ్యతరగతి ప్రజలకు కూరగాయల ధరలు అందుబాటులో ఉండేవి. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూరగాయల మార్కెట్ దళారులకు అడ్డాగా మారింది. దళారులు సిండికేట్‌గా మారడంతో కూరగాయల ధరకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. గజపతినగరం, విజయనగరం పట్టణ ప్రాంతాలకు చెందిన దళారులు నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేసి వాటిని నచ్చిన ధరకు అమ్మకాలు చేపడుతున్నారు. వ్యవసాయ మార్కెట్ అధికారులు చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఎర్యవసానంగా ఇటు రైతులు, అటు కొనుగోలుదారులు నష్టపోతున్నారు.

ప్రతిరోజు మార్కెట్‌లో కూరగాయల ధరలను బోర్డులో సంబంధిత సిబ్బంది రాయాల్సి ఉంది. అయితే, ఆ బోర్డులో ధరలు రాసే దాఖలాలు లేదు. దాంతో వ్యాపారులు చెప్పిన ధరలకే కొనుగోలు చేయాల్సి వస్తోంది. దళారీల బాధపడలేక చాలా మంది మెంటాడ రోడ్డు వద్ద తెల్లవారు జామున కూరగాయలను విక్రయించి వెళ్లిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూరగాయల మార్కెట్‌లో ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరారు.


ధరలు లేని పట్టిక


గజపతినగరంలో కూరగాయల మార్కెట్

చర్యలు తీసుకుంటాం..

రైతుబజారులో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తాం. అలాగే మార్కెట్‌లో దళారీ వ్యవస్థ నిర్మూలనకు చర్యలు చేపడతాం.

-వై.మురళీ, ఏఎంసీ-సూపర్‌వైజర్, గజపతినగరం

ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ



కొత్తవలస, జూన్13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవాడ-ముసిరాం గ్రామాల మధ్య వెలిసిన తోటలో దుర్గమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారిని మహాలక్ష్మిగా ప్రత్యేకంగా గాజులతో అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేపు జిల్లా రెవెన్యూ సంఘం కార్యవర్గం ఎన్నిక

విజయనగరం కలెక్టరేట్, జూన్13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రెవెన్యూ హోంలో ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక నిర్వహించనున్నట్టు జిల్లా రెవెన్యూ సంఘం కార్యదర్శి ఐ.సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సంఘం ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో కార్యవర్గం ఎన్నిక నిర్వహిస్తున్నామన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన సంఘం అధ్యక్షులు ఆధ్వర్యంలో ఎన్నిక జరుగుతుందన్నారు. జిల్లా ఉద్యోగులు అందరూ హాజరు కావాలని కోరారు.

పశు సంవర్ధకశాఖ ఏడీగా శారద

విజయనగరం రింగురోడ్డు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా డాక్టరు ఆర్.శారద శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడిరైతుల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. అలాగే సీజన్‌లో పశువులకు వచ్చే వ్యాధులపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

పోస్టాఫీసుల్లో సంస్కరణలు

గంట్యాడ, జూన్13 (ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసుల్లో సంస్కరణల్లో భాగంగా ఐటీ 2.0 సాఫ్ట్‌వేర్ అందుబాటులో తెచ్చినట్టు విజయనగరం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కొల్లూరు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక బీఎడ్ కళాశాలలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌ను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలన్నారు. డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ చేసుకోవడానికి అర్హులన్నారు. ఈ నేపథ్యంలో 18, 19 తేదీల్లో నిర్వహించనున్న ఇన్సూరెన్స్ మేళాలను విజయవంతం చేయాలని కోరారు. ఆయనతో పాటు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర ఉన్నారు.

విద్యార్థుల ఇబ్బందులు తప్పించిన నాయకులు

శృంగవరపుకోట రూరల్, జూన్13 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో బురదమయంగా మారిన వెంకటరమణపేట ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం స్థానిక టీడీపీ నాయకులు క్రషర్ బుగ్గిని వేయించారు. విద్యార్థులకు అవస్థలను తప్పించారు. టీడీపీ మండల పార్టీ కార్యదర్శి జుత్తాడ రామసత్యం ఆధ్వర్యంలో సమస్య పరిష్కారానికి స్థానిక పార్టీ నాయకులు నడుం బిగించారు. సొంత నిధులతో పాఠశాల ప్రాంగణాన్ని బాగుచేశారు కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కె.ఈశ్వరరావు, పెందుర్తి సూరిబాబు, అప్పలసూరి, గంగరాజు, వంకల శ్రీనివాసరావు, ఎర్రప్రగడ భాస్కరరావు తదితరులున్నారు.

నేడు కుట్టు శిక్షణ ప్రారంభం

వేపాడ జూన్ 12 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రమైన వేపాడలో గల స్త్రీశక్తి భవనంలో శనివారం మహిళలకు కుట్టు శిక్షణ తరగతులను ప్రారంభించనున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు గొంప వెంకటరావు తెలిపారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రారంభిస్తారన్నారు.

ప్రజాదర్బార్ వినతులకు ప్రాధాన్యం

విజయనగరం రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్‌లో అందిన వినతులకు అధిక ప్రాధాన్యమిస్తానని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో 41 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ వినతులను ఆన్‌లైన్ చేసి సంబంధిత విభాగాలకు పంపుతున్నామన్నారు. పంపిన వినతులు ఏ దశలో ఉన్నాయనే దానిపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని తీసుకుంటున్నామన్నారు.


ఫిర్యాదును స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

రక్తదానం జీవదానంతో సమానం

విజయనగరం దాసన్నపేట, జూన్13 (ఆంధ్రజ్యోతి): రక్తదానం జీవదానంతో సమానమని రెడ్‌క్రాస్ చైర్మన్ కె.ఆర్.డి.ప్రసాదరావు అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రంథాలయ సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో విజయనగరం ఫోర్టు క్యాంపస్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.ఎస్.ఎన్.రాజు, సుభద్రాదేవి, హరికృష్ణ ప్రసాద్, కె.ఎస్.ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రసాద్

‘ఉపాధి’ బకాయిలు చెల్లించండి

గజపతినగరం, జూన్13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హమీ పథకం వేతనదారులకు పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు రెట్టింగి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పాతబగ్గాంలో గ్రామ సచివాలయ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి వేతనదారులకు 8 వారాలుగా బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. సకాలంలో వేతనాలు అందకపోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వేతనదారులకు ఏడాది 200 పని, రోజువారీ రూ.600 గిట్టుబాటు వేతనం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో చిరంజీవి, కోట సింహాద్రి, కర్రి రమణ, పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

విమాన ప్రమాద మృతులకు నివాళి

శృంగవరపుకోట, జూన్13 (ఆంధ్రజ్యోతి): స్థానిక పుణ్యగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం విమాన ప్రమాద మృతులకు ఎన్‌సీసీ క్యాడెట్లు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఎన్‌సీసీ అధికారి ఈరన్న ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.



నివాళులర్పిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

కార్మికుల సమస్యలను పరిష్కరించండి

విజయనగరం రింగురోడ్డు, జూన్13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా కార్యదర్శి వీజీ రాఫెల్ డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మికశాఖ కమిషనర్ ఎస్‌వీడీ ప్రసాదరావును యూనియన్ ప్రతినిధులతో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు ఎం.కృష్ణ, కె.బంగార్రాజు, వై.నర్సయ్య పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

విజయనగరం దాసన్నపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఫూల్‌బాగ్‌లో మహారాజా ఫార్మసీ కళాశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రామయ్య మాట్లాడుతూ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా అధ్యాపకుల బోధన నైపుణ్యాన్ని అభివృద్ధి చేయడమే కాకుండా నూతన విద్యా సాంకేతికతపై అవగాహన పెంపొందించామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వి.సునీత, డాక్టర్ వి.నాగేష్ పాల్గొన్నారు.


సిబ్బందితో ప్రిన్సిపాల్ రామయ్య

మౌలిక వసతులు కల్పించండి

గజపతినగరం, జూన్13 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని అధికారులను న్యాయాధికారి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని లోగిసలో గల సమగ్ర సంక్షేమ వసతిగృహ సముదాయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు తెరిచిన నేపథ్యంలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, బెడ్ల సదుపాయంపై ఆరా తీశారు. సమస్యలు ఏమైనా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని సూచించారు. ఆయనతో పాటు ప్యానల్ న్యాయవాది కె.సాయిశేఖరరావు వసతిగృహ సిబ్బంది పాల్గొన్నారు.


లోగిసలో వసతి గృహాన్ని పరిశీలిస్తున్న న్యాయాధికారి

విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

విజయనగరం రింగురోడ్డు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణుల సంక్షేమంతో పాటు వారి సమస్యలపై పోరాటానికి సంఘం రాష్ట్ర నూతన కమిటీ కృషి చేయనుందని రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గురజాడ ఆనందకుమార్, చైర్మన్ మేడపి వెంకటప్రసాద్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం రౌండ్ టేబిల్ సమావేశాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ విశ్వబ్రాహ్మణ సంఘాలు, స్వర్ణకార, వండ్రంగి, కంచర, కమ్మర, శిల్పులు, ఉద్యోగ, వ్యాపార, వ్యాపార, వేద పండిత సంఘాలను కలుపుతూ అగ్రిగోల్డ్ సంఘంగా ఏర్పాటు చేయాలన్న ఆలోచనతో ఉన్నామన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు రామకృష్ణ, కిర్లంపల్లి ఆచారి, గోకవరపు శ్రీనివాస్, కానూరు లక్ష్మణ్, కన్నా ప్రసాద్, పెదపూడి నర్సింహమూర్తి, జానా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌కుమార్

మూతపడిన డ్రైనేజీ పరిశీలన

దత్తిరాజేరు, జూన్13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదమానాపురంలో బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా మూతపడిన ప్రధాన డ్రైనేజీని శుక్రవారం నేషనల్ హైవే డీఈ భాస్కరరావు, పెదమానాపురం రైల్వే బ్రిడ్జి ఏఈ విశాల్‌గుప్తా పరిశీలించారు. డ్రైనేజీ మూతపడటంతో రెండు రోజుల కిందట నేషనల్ హైవే కార్యాలయంలో గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. కల్వర్టు నిర్మించాలని ఫిర్యాదు ఇచ్చారు. స్థానిక మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కార్యాలయానికి ఫిర్యాదు చేయడంతో ఆయన స్పందించారు. సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించడంతో వారు క్షేత్రస్థాయిలో సమస్యను గుర్తించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గేదెల రామసత్యం, గాడి అప్పలనాయుడు, వార్డు సభ్యులు గంట తులసీనాయుడు, పట్టా ప్రసాదరావు, చొక్కా ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ ఉన్నారు.


గ్రామస్థులతో చర్చిస్తున్న రైల్వే, హైవే అధికారులు

ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మెంటాడ, జూన్13 (ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలకు సమీపంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న రిటైర్డ్ వీఆర్వోకు తహసీల్దార్ అరుణకుమారి చెక్ పెట్టారు. ‘ప్రభుత్వ భూమిపై మాజీ వీఆర్వో కన్ను’ శీర్షికతో గురువారం ‘ఆంధ్రజ్యోతి’లో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. సర్వే నెంబర్ 188లోని ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయించారు.


బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

విజయనగరం క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం తోటపాలెంలోని కళాశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడేవారితో జాగ్రత్తగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న సీఐ శ్రీనివాస్

చిన్నారులకు అక్షరాభ్యాసాలు


నెల్లిమర్లలో..


దత్తిరాజేరులో..


ఎస్.కోటలో..

శృంగవరపుకోట రూరల్, జూన్13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరమణపేట, ధర్మవరం అంగన్‌వాడీకేంద్రాల్లో శుక్రవారం చిన్నారులకు అక్షరాభ్యాసాలను నిర్వహించారు. ఐసీడీఎస్ పీవో అచ్యుతాంబ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

● నెల్లిమర్ల: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ నెల్లిమర్ల అర్బన్‌సూపర్‌వైజర్ టి.త్రినాథ కోరారు. నగర పంచాయతీలోని తామస్‌పేట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసాలను నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ బోధకులు పి.రమ, ఎస్.సరస్వతి, తల్లులు పాల్గొన్నారు.

● దత్తిరాజేరు: మండలంలోని ఎం.లింగాలవలస రామాలయంలో శుక్రవారం విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. దానధర్మ చారిటబుల్ ట్రస్టు, దాతల సహకారంతో 25 మంది బాలబాలికలకు ఉచితంగా అక్షరాభ్యాసాలు జరిగాయి. వేదపండితుడు అరవెళ్లి వేణుబాబు అక్షరాభ్యాసాలు చేయించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర భజన బృందం సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతి

● కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు

జామి, జూన్13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాసనపల్లి- వెంకటరాజు పాలెం వద్ద సచివాలయం లైన్‌మన్ రెహ్మాన్(26) విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు విడిచాడు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. వెంకటరాజుపాలెం సచివాలయం పరిధిలో లైన్‌మన్‌గా షేక్ రెహ్మాన్ పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్న సమయంలో శాసనపల్లి-సోమయాజులపాలెం దారిలో సోమయాజులపాలెం గ్రామానికి ఒక లైన్‌లో విద్యుత్ సరఫరా లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. వెంటనే అక్కడకు రెహ్మాన్ చేరుకుని ఆ లైన్‌కు సంబంధించిన విద్యుత్ సరఫరాను సబ్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆపి స్తంభం ఎక్కాడు. అయితే విద్యుత్ లైన్ బాగుచేస్తున్న సమయంలో అతడి తలపై ఉన్న 11 కేవీ విద్యుత్ తీగ రెహ్మాన్‌కు తగిలింది. తలకు మంట వ్యాపించడంతో ఒక్కసారిగా కిందపడిపోయాడు. విషయం గ్రహించిన స్థానికులు విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించేసరికి మృతి చెందాడు. రెహ్మాన్ ఇదే మండలంలోని లోట్లపల్లి గ్రామానికి చెందినవాడు. అతడి తండ్రి షేక్‌మదీనావలి, తల్లి నన్నేబీ కూలి పనులు చేస్తుంటారు. కూతురు, కొడుకును చదివించారు. కొడుకుకు ఉద్యోగం వచ్చాక కూతురికి అప్పుచేసి పెళ్లిచేశారు. కొడుకుకు ఉద్యోగం ఉందన్న భరోసాతో వారు పేదరికంలో ఉన్నా దీమాగా బతుకుతున్నారు. ఇలాంటి సమయంలో కొడుకు ఇక లేడని తెలియడంతో వారు కన్నీరుమున్నీరయ్యారు.


రెహ్మాన్ (ఫైల్)

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

లక్కవరపుకోట, జూన్13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంతో గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఎల్.కోటకు చెందిన పెదగాడి అప్పారావు శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఈ నెల 9న ఎల్.కోట జంక్షన్‌లో కారు ఢీకొనడంతో అప్పారావు గాయపడ్డారు. ఆయనకు భార్య అచ్చియ్యమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్త, కోడలు విద్యుదాఘాతానికి గురయ్యారని..

● ఆందోళనతో మహిళ హఠాన్మరణం

భామిని, జూన్13 (ఆంధ్రజ్యోతి): భర్త, కోడలు విద్యుదాఘాతానికి గురికావడంతో ఆందోళన చెందిన మహిళ హఠాన్మరణం చెందిన ఘటన శుక్రవారం రాత్రి వడ్డంగి గ్రామంలో చోటు చేసుకుంది. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వడ్డంగి గ్రామానికి చెందిన బొమ్మిక మల్లేశ్వరరావు, బొమ్మిక శ్రీదేవి (50)లకు ఇద్దరు కుమారులు నవీన్, పృథ్వీ వీరిద్దరూ హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో పనిచేస్తున్నారు. పెద్దకుమారుడు నవీన్ భార్య మహేశ్వరి ప్రస్తుతం అత్తామామల వద్ద వడ్డంగిలో ఉంటోంది. పృథ్వీకి ఇంకా పెళ్లి కాలేదు. మల్లేశ్వరరావు శుక్రవారం సాయంత్రం స్నానం చేసి, బయట పెరడులో కట్టిన వైరుపై దుస్తులు ఆరేస్తుండగా, ప్రమాదవశాత్తు వైరుకు విద్యుత్ సరఫరా అయ్యింది. దీంతో విద్యుదాఘాతానికి గురై కేకలు వేశాడు. సమీపంలో ఉన్న కోడలు మహేశ్వరి వెంటనే వచ్చి ఆయన్ని తప్పించే క్రమంలో విద్యుదాఘాతానికి గురైంది. వారిద్దరూ గట్టిగా కేకలు వేయడంతో ఇంట్లో ఉన్న శ్రీదేవి బయటకు వచ్చి, ఆందోళనతో ఒక్కసారిగా కుప్పకూలింది. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. శ్రీదేవి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. అయితే మల్లేశ్వరరావుకు పెద్దగా ప్రమాదం జరగలేదు. మహేశ్వరి షాక్‌కు గురికావడంతో భామిని పీహెచ్‌సీకి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉంది.

పట్టుబడిన దొంగలు

● బంగారు ఆభరణాల రికవరీ ● నిందితులది విజయనగరం జిల్లా

శ్రీకాకుళం క్రైం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ఓ చోరీ కేసులో దొంగతనానికి పాల్పడిన వారిని పట్టుకున్నట్టు టూటౌన్ సీఐ ఈశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఎచ్చెర్ల మండలం సాకివానిపేట గ్రామానికి చెందిన కోరాడ రామలక్ష్మి తన భర్తతో కలిసి ఈ నెల 5వ తేదీన ఓ ఆటోలో ప్రయాణిస్తుండగా.. అదే ఆటోలో ఉన్న ఇద్దరు తమ బంగారు ఆభరణాలను కాజేశారని అదే రోజు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ రామారావు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో తోటపాలెం జంక్షన్ వద్ద విజయనగరం జిల్లా మెంటాడ మండలం పెట్టాడ గ్రామానికి చెందిన గొర్రెల మౌనిక, గొర్ల పెద్దింటమ్మ, కొత్తవలస మండలం చీడివలసకు చెందిన మేకల హరిలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని ఆటో సీజ్ చేసి కోర్టుకు తరలించినట్టు తెలిపారు. కాగా వీరు ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలు చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్నారు.


పోలీసుల అదుపులో నిందితులు

ఆటో బోల్తా: మహిళకు గాయాలు

చీపురుపల్లి, జూన్13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జి.అగ్రహారంలో ఏనుగువలస జంక్షన్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు అందించిన వివరాల మేరకు.. గరివిడి మండలం బొండపల్లికి చెందిన నవరపు సావిత్రి, వెదుళ్లవలస నుంచి ఆటోలో బొండపల్లి వెళ్తోంది. జి.అగ్రహారం సమీపంలో ఎదురుగా వస్తున్న మోటారు బైక్‌ను తప్పించబోయి ఆటో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దాంతో ఆటో బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న నవరపు సావిత్రికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం విజయనగరం ఆస్పత్రిలో చేర్చారు. ఈ ఘటనపై ఎస్ఐ ఎల్.దామోదరరావు కేసు నమోదు చేశారు.

13 మంది పేకాటరాయుళ్ల అరెస్టు


నెల్లిమర్ల, జూన్13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండవెలగాడ శివారు సీతమ్మ చెరువులో ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శుక్రవారం ఎస్ఐ బి.గణేష్, సిబ్బంది దాడి చేశారు. 13 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.8860 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

వడ్రంగికి గాయాలు

రేగిడి, జూన్13 (ఆంధ్రజ్యోతి): రేగిడికి చెందిన వడ్రంగి అరసవల్లి దుర్గారావు శుక్రవారం తీవ్రంగా గాయపడ్డారు. రంపం బ్లేడ్ తగలడంతో కాలి పై గాయమైంది. సమాచారం తెలుసుకున్న రేగిడి 108 సిబ్బంది ఈఎంటీ ఈశ్వరరావు ప్రాథమిక చికిత్స అనంతరం పాలకొండ ఆసుపత్రికి తరలించారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వండి

విజయనగరం దాసన్నపేట, జూన్13 (ఆంధ్రజ్యోతి): నగర శివార్లలోని ధర్మపురిలో సర్వే నెంబరు 86/1, 2, 3 గయాళ్‌లోని 3.77 సెంట్ల భూమిని 22-ఎ నుంచి తొలగించి పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని పట్టణ బడుగు, బలహీన వర్గాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రెడ్డి నారాయణరావు డిమాండ్ చేశారు. ఈ నెల 16న తహసీల్దారు కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నాను అందరూ విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం నగరంలో ఆందోళనకు దిగారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని పేదలకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు అప్పలరాజు రెడ్డి, సీతమ్మ, రాజేశ్వరి, రామారావు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న సంఘ ప్రతినిధులు

అనుమతి లేని నిర్మాణాలను ఉపేక్షించం

విజయనగరం రింగురోడ్డు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అనుమతుల్లేని నిర్మాణాలను ఊపేక్షించబోమని నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య స్పష్టం చేశారు. తోటపాలెంలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న భవనాన్ని శుక్రవారం కూల్చివేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అనుమతి లేకుండా ఎక్కడ భవన నిర్మాణాలు చేపట్టినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తల్లికి వందనం..
కుటుంబాల్లో ఆనందం

(5వ పేజీ తరువాయి)

పాఠశాలలు, వాటిల్లో మరుగుదొడ్ల నిర్వహణకు రూ.2వేలు మినహాయించారు. మిగతా రూ.13 వేలను తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నారు.

జాబితాలో పేరు లేకున్నా.. నో టెన్షన్

సాలూరు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి విద్యార్థికి తల్లి వందనం పథకం వర్తింపజేయడానికి అధికారులు కార్యాచరణ చేస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్హుల జాబితాలున్నప్పటికీ వాటిల్లో కొద్దిమంది పేర్లు లేవు. దీనికి గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. పథకానికి అర్హులై ఉండి, జాబితాలో పేర్లు లేని వారికి కూడా తల్లికి వందనం కింద నగదు అందించడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇటువంటి వారి వివరాలను తక్షణమే సేకరించి యుద్ధప్రాతిపదికన ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయించాలని ఎంఈవోలను డీఈవో రాజ్‌కుమార్ ఆదేశించారు. విద్యార్థి తండ్రి లేదా తల్లి ఆధార్ నెంబర్ లేకపోవడం వంటి సమస్యలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలతో మాట్లాడి అప్‌డేట్ చేసేందుకు ఎంఈవో చొరవ తీసుకోవాలని సూచించారు.

మినీ రిజర్వాయర్ నిర్మిస్తే
సస్యశ్యామలమే..

(5వ పేజీ తరువాయి)

రైతులంతా ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి దృష్టికి తీసుకెళ్లారు.

ఇదీ పరిస్థితి..

రాళ్లగెడ్డ అనేది.. జియ్యమ్మవలస, వీరఘట్టం, సీతంపేట మండలాల్లో పది వేల ఎకరాలకు సాగునీరందించే రెండు ప్రధాన కాలువల సమూహం. ఇందులో నార్త్ ప్రధాన కాలువ పొడవు 5.5 కిలో మీటర్లు. దీని ద్వారా అర్నాడ, జియ్యమ్మవలస, డంగభద్ర, గడసింగుపురం పంచాయతీల్లో 11 గ్రామాల పరిధిలో 9,500 ఎకాలకు సాగునీరందుతుంది. సౌత్ ప్రధాన కాలువ పొడవు 6 కిలో మీటర్లు. దీని ద్వారా వీరఘట్టం మండలం సంతనర్సిపురం పంచాయతీలో 500 ఎకరాలకు సాగునీరందుతుంది. సీతంపేట మండలంలో మానాపురం, తాడిపాయి గ్రామాల్లో మరో 200 ఎకరాలకు కూడా దాని ద్వారా సాగునీరందే వీలుంది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. సీతంపేట మండలం మానాపురం - తాడిపాయి గ్రామాల మధ్య ఉన్న రెండు కొండల మధ్య మినీ రిజర్వాయర్ నిర్మిస్తే మూడు మండలాల్లో 10 వేల ఎకరాలు సస్యశ్యామలమవుతాయి.

పూడికలతో నిండిన కాలువలు

సీతంపేట కొండలపై నుంచి వచ్చే నీరు ఈ రాళ్లగెడ్డ ద్వారా భూములకు నీరందుతంది. అయితే నిర్వహణ లేక కాలువలు ఇసుక, మట్టితో పేరుకుపోగా శివారు భూములకు నీరందడం లేదు. దశాబ్దాల కిందట నిర్మించిన డ్రాపులు, స్లక్చర్లు, చెక్‌డ్యాములు, మదుములు, కల్వర్టులన్నీ శిథిలమైపోయాయి. కనీసం 5 వేల ఎకరాలకైనా సాగునీరందని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు గ్రామాలను వదిలి వలస బాటపట్టారు. బోర్లు తీసుకునే ఆర్థిక స్థోమత లేక బతుకు జీవుడా అంటూ మరికొంతమంది రైతులు కాలం వెళ్లదీస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజం లేకపోయింది. దీనిపై స్పందించేవారే కరువయ్యారు. రాళ్లగెడ్డపై మినీ రిజర్వాయర్ నిర్మాణం విషయంలో పాలకొండ, కురుపాం నియోజకవర్గాల ఎమ్మెల్యేలు చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం శ్రద్ధ చూపాలి

రాళ్లగెడ్డపై మినీ వంతెన నిర్మాణం అనేది మా చిరకాల ఆకాంక్ష. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలి. దాని నిర్మాణం పూర్తయితే మా భూములు సస్యశ్యామలం అవుతాయి.

- జోగి భుజంగరావు, సర్పంచ్, డంగభద్ర

తీవ్రంగా ఉద్యమిస్తాం

రాళ్లగెడ్డపై మినీ వంతెన నిర్మిస్తే సీతంపేట, వీరఘట్టం, జియ్యమ్మవలస మండలాల్లో 13 పంచాయతీల్లో వ్యవసాయ భూములకు సాగునీరు అందుతుంది. దీనిపై ఎక్కువగా గిరిజన రైతులే ఆధారపడి ఉన్నారు. నిర్మాణం చేపట్టకపోతే తీవ్రంగా ఉద్యమిస్తాం.

- కె.సీతారాం, రైతు సంఘం కార్యదర్శి

ప్రభుత్వం దృష్టిలో ఉంది

రాళ్లగెడ్డపై మినీ వంతెన నిర్మాణం అనేది గతంలో ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రస్తుతం ఈ సమస్య ప్రభుత్వం దృష్టిలో ఉంది.

- జీవీ రఘు, ఏఈ, నీటి పారుదలశాఖ

యోగాంధ్రను విజయవంతం చేయాలి

గరుగుబిల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సచివాలయాల పరిధిలో యోగాంధ్రను విజయవంతం చేయాలని ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావులు సూచించారు. శుక్రవారం స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో సచివాలయాల కార్యదర్శులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఈనెల 14న పంచాయతీల పరిధిలో ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల్లోపు యోగాంధ్రను విధిగా నిర్వహించాలన్నారు. యోగాంధ్ర కారణంగా సిబ్బందికి ఎటువంటి సెలవులు మంజూరు చేయలేదన్నారు. ఈ సమావేశంలో కార్యాలయ ఏవో ఎ.అర్జునరావు, ఏపీఎం పి.అప్పలనాయుడు, ఏపీవో ఎం.గౌరీనాథ్, ఉపాధి ఈసీ డి.తేజేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రామభద్రపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా నాయుడువలస గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులతో యోగాస నాలు వేయించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు. యోగాతో ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు.

పారిశుధ్య నిర్వహణపై అలసత్వం వద్దు

గరుగుబిల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో పారిశుధ్య నిర్వహణపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో జి.పైడితల్లి, విస్తరణాధికారి ఎల్.గోపాలరావులు హెచ్చరించారు. మండలంలోని గొట్టివలస, గరుగుబిల్లి, పెద్దూరు పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ పనులను వారు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ లోపం కారణంగా వ్యాధులు విజృంభించినట్లయితే సంబంధిత కార్యదర్శులే బాధ్యత వహించాలన్నారు. తాగునీటి ప్రాంతాల్లో క్లోరినేషన్ నిర్వహించాలన్నారు. ఈ పరిశీలనలో కార్యదర్శి శిరీష, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బి.వరలక్ష్మి, సర్పంచ్ బి.చంద్రినాయుడు తదితరులు ఉన్నారు.

కార్మికులపై కేసు కొట్టివేత

బొబ్బిలి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన పిలుపుమేరకు 2018లో చేసిన సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్టు పారిశు ధ్య కార్మికులపై పెట్టిన కేసును స్థానిక కోర్టు శుక్రవారం కొట్టివేసినట్టు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు, న్యాయవాది చందాన సూర్యనారాయణ తెలిపారు. జీవో నెంబరు 279కి వ్యతిరేకంగా అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు సమ్మె నిర్వ హించారని చెప్పారు. ప్రైవేటు పారిశుధ్య కార్మికులను మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు అడ్డుకున్నారని, మున్సిపల్ ఆస్తులను ధ్వంసం చేశారన్న అభియోగంతో 20మందిపై పోలీసు లు కేసు నమోదు చేశారన్నారు. కార్మికుల తరపున సరైన వాదనలను వినిపించడంతో కోర్టు ఈ కేసును కొట్టివేయడం పట్ల వారు హర్షం వ్యక్తంచేశారు.

ఇది జలాశయమే..

- చుక్కనీరు లేని చిత్రకోట రిజర్వాయర్
- అర్ధాంతరంగా నిలిచిన నిర్మాణం
- వీఆర్ఎస్ కాలువ నుంచి నీరు మళ్లించాలని కోరుతున్న రైతులు

బొబ్బిలి రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీహెచ్ బొడ్డవలస పంచాయతీ, వెలగవలస వద్ద చిత్రకోట జలాశయం చుక్కనీరు లేక మైదానాన్ని తలపిస్తోంది. ఈ జలాశయాన్ని చిత్రకోట బొడ్డవలస, వెలగవలస గ్రామాల పరిధిలోని సుమారు 350 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 20 ఏళ్ల కిందట అప్పటి టీడీపీ హయాంలో నిర్మించారు. అయితే నిధులు చాలకపోడంతో పూర్తికాలేదు. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోలేదు. అప్పట్లో తవ్విన కాలువలు కూడా పూడుకుపోయాయి. కేవలం వర్షం పడితే అందులో చేరిన నీరు పొలాలకు వెళ్తుంది. వెంగళరాయసాగర్ ప్రధాన కాలువకు అనుసంధానం చేస్తే జలాశయం నిండి పొలాలకు నీరు మళ్లించుకోవచ్చని రైతులు పలుమార్లు అధికారులకు విన్నవించారు. అయినా పట్టించుకున్న నాథుడే లేడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ జలాశయానికి వీఆర్ఎస్ నుంచి నీరు మళ్లించాలని కోరుతున్నారు. ● ఈ విషయంపై ఏఈ సుధీర్‌ని వివరణ కోరగా జలాశయ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు.



మైదానాన్ని తలపిస్తున్న చిత్రకోట జలాశయం

వంద పడకల ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకురండి

- ఉత్తరాంధ్ర అధ్యయన వేదిక డిమాండ్

సాలూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సాలూరు పట్టణంలో వంద పడకల ఆసుపత్రిలో వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని ఉత్తరాంధ్ర అధ్యయన వేదిక ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. శనివారం ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజయ్ శర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షురాలు కె.విజయగౌరి, నాయకుడు కె.వెంకటరావు, ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు రవికుమార్ బృందం నిర్మాణంలో ఉన్న వందపడకల ఆసుపత్రిని, ప్రస్తుతం ఆసుపత్రిల్లో అందుతున్న వైద్యాన్ని పరిశీలించారు. నర్సింగ్ విద్యార్థులు చేస్తున్న రెగ్యులర్ చెకప్‌లు, టెస్టులు, పేషెంట్లతో కూడిన వార్డులు, స్కానర్ మిషన్లు, గదులను పరిశీలించారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య ఉద్యోగుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆర్ఎంవో ద్వారా హాస్టల్ సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణాన్ని పూర్తిచేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. వంద పడకల ఆసుపత్రి అందుబాటులోకి వస్తే రోగులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సంఘాల నాయకులు శ్రీనివాసరావు, ఈశ్వరరావు, ఎన్‌వై.నాయుడు పాల్గొన్నారు.

వైద్యాధికారులను నియమించాలి

కురుపాం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రులలో వైద్యాధికారులను, వైద్య సిబ్బందిని నియమించి, మౌలిక వసతులు కల్పించాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజయ్‌శర్మ కోరారు. కురుపాం సీహెచ్‌సీని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక బృందం శుక్రవారం సందర్శించింది. ఈసందర్భంగా ఆసుపత్రి వార్డులో రోగులను పరామర్శించి, వైద్య సేవలు, మౌలిక వసతులపై అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ల్యాబ్, ఎక్స్‌రే, మరుగుదొడ్లు పరిశీలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.శోభారాణితో మాట్లాడి వైద్య సిబ్బంది, మౌలిక వసతులపై అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 పడకల ఆసుపత్రి భవనం నిర్మాణం పూర్తయ్యేలా ప్రభుత్వ చర్యలు చేపట్టాలని కోరారు. వైద్యులు, వైద్య సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించాలన్నారు. ఈ కార్యక్రమలో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఉపాధ్యక్షురాలు కె.విజయగౌరి, ఆర్గనైజర్ సెక్రటరీ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.



సాలూరు: ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న బృంద సభ్యులు

ప్రతి హామీని అమలు చేస్తున్నాం

పార్వతీపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని దశల వారీగా అమలు చేస్తున్నామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో ఫోన్‌లో మాట్లాడారు. ఇచ్చిన హామీ ప్రకారం ఒకే కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుతున్నా వారందరికీ తల్లికి వందనం పథకం కింద తల్లులు ఖాతాల్లో రూ.13వేలు జమ చేశామని చెప్పారు. నిర్వహణ కోసం రూ.2వేలు మంజూరు చేశామన్నారు.

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

గుమ్మలక్ష్మీపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుని తల్లికి వందనం పథకాన్ని ప్రారంభించిందని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ఆమె శుక్రవారం స్థానిక విలేకర్లతో ఫోన్‌లో మాట్లాడారు. తల్లికి వందనం పథకంలో భాగంగా కూటమి ప్రభుత్వం తల్లుల ఖాతాలో రూ.13వేలు చొప్పున జమ చేసిందని తెలిపారు. ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేస్తోందన్నారు.

అన్నివర్గాల్లో ఆనందం

పార్వతీపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం అమలు చేయడంతో సమాజంలో అన్ని వర్గాల ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ఆయన శుక్రవారం స్థానిక విలేకర్లతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ పథకం ద్వారా ఒక ఇంటిలో ఎంతమంది చదువుకుంటున్న పిల్లలు ఉన్నా అందరికీ పథకాన్ని వర్తింప చేయడంతో తల్లులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

సారా స్వాధీనం

కురుపాం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): జియ్యమ్మవలస మండలం చినబుడ్డి గ్రామానికి చెందిన మండగి శంకరరావు అక్రమంగా 20 లీటర్ల సారా తరలిస్తుండగా అరెస్టు చేసి, 20 లీటర్లు సారా, బైక్ స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. సారా సరఫరా చేసిన చినమేరంగి గ్రామానికి చెందిన శంభాన విజయ్‌కుమర్‌పై కూడా కేసు నమోదు చేశామని చెప్పారు. ఎస్ఐ రాజశేఖర్,సిబ్బంది పాల్గొన్నారు.

పంట పొలాలకు రహదారి సౌకర్యం కల్పించాలి

గరుగుబిల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గిజబ గ్రామ సమీపంలోని రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పలువురు ఆక్రమించుకుని షెడ్లు, పెంట కుప్పలతో పాటు అడ్డంగా కంచెను వేయడంతో పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులకు గురవుతున్నామని ఆ గ్రామానికి చెందిన రైతులు వాపోయారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ పి.బాలకు వినతిపత్రం అందజేశారు. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చెప్పారు.

వసతిగృహాలకు డైట్ బిల్లులు చెల్లించాలి

సాలూరు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్న గిరిజన వసతిగృహాలకు బకాయి ఉన్న డైట్ బిల్లులు చెల్లించాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్ల సురేష్, నేతలు సీతారం, బంగారురాజులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలు ఈనెల 12 నుంచి తెరిచారని చెప్పారు. అయితే గత బిల్లులే పెండింగ్ ఉన్నందున నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా వాటి పెండింగ్ బిల్లులు చెల్లించాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

యోగాపై చిత్రలేఖన పోటీలు

- పర్యవేక్షించిన డీఎంహెచ్‌వో భాస్కరరావు

పార్వతీపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర మాసోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపాలని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీలను ఆయన పర్యవేక్షణ చేశారు. యోగా ప్రదర్శన, చిత్రలేఖనం తదితర పోటీలను ఆయన పరిశీలించారు. యోగా గురు మోహన్ గుంటాయత్ బృందంతో కూడిన ఐదుగురు సభ్యులు జిల్లా స్థాయి పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారని తెలిపారు. యోగాంధ్ర జిల్లా కన్వీనర్ టి.జగన్మోహనరావు, హోమియో వైద్యురాలు సుశీల, జిల్లా కన్సల్టెంట్ రఘు, యోగా గురువులు పాల్గొన్నారు.



చిత్రలేఖన పోటీలను పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్‌వో

గిరిజన ఆశ్రమాల సమస్యలను పరిష్కరించాలి

గుమ్మలక్ష్మీపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గిరిజన విద్యార్థి సంఘ అధ్యక్షుడు పల్ల సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆశ్రమాలలో సరైన సదుపాయాలు లేక అరకొర భవనాల్లో విద్యార్థులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వసతిగృహాల్లో బోధనేతర సిబ్బంది, కుక్, కమాటీలు, వర్కర్లు లేరని ఆయన పేర్కొన్నారు. ఆశ్రమాల్లో ఆరోగ్య సిబ్బందిని నియమిస్తామని మంత్రి సంధ్యారాణి మొదటి సంతకం పెట్టారని, సంవత్సరం గడుస్తున్నా ఫలితం లేదన్నారు. ఆశ్రమాల్లో ఆరోగ్య సిబ్బందిని నియమించాలని ఆయన కోరారు. కొటికిపెంట ఏకలవ్య పాఠశాలలో ఓ గిరిజన విద్యార్థిని ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిందని తెలిపారు. బాలికల వసతిగృహాలకు ప్రహరీలు నిర్మించాలని ఆయన కోరారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

పాలకొండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెల్లివీధిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని రెల్లికుల అభివృద్ధి సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజుకు వినతిపత్రం అందించారు. రెల్లివీధిలో తరచూ తాగునీటి సమస్య ఎదురవుతుందని, ఎన్నో ఏళ్ల నుంచి ఈ సమస్య పరిష్కారం కావడం లేదని తెలిపారు. అలాగే సిమెంట్ రోడ్డును, సామాజిక భవనం నిర్మించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రెల్లికుల అభివృద్ధి సంఘం సభ్యులు రాజు, బాలరాజు ఉన్నారు.



నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

విమాన ప్రమాద మృతులకు నివాళి

బొబ్బిలి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో అశువులు బాసిన వందలాది మంది ఆత్మలకు శాంతి కలగాలని బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది నివాళులు అర్పించారు. రోటరీ చైర్మన్ జేసీ రాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారంతా కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటించారు. రోటరీ ఎలెక్ట్ ప్రెసిడెంట్ శ్రీహరి, శివ, ఐటీఐ అధికారులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నామమాత్రంగా సర్వసభ్య సమావేశం

బాడంగి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బోగి గౌరి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం నామమాత్రం గా సాగింది. తొలుత విమాన ప్రమాదంలో మృతిచెందిన వారికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం అధికారులతో వారివారి శాఖలపై సమీక్ష నిర్వహించి, మమా అనిపించారు. ఎంపీటీసీ లు, సర్పంచ్‌లు ఆయా గ్రామాల సమస్యలను అధికారులకు విన్నవించారు. ఈ సమావేశం లో వైస్ ఎంపీపీలు భాస్కరరావు, రమేష్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

చర్చల పేరిట కాలయాపన తగదు

రాజాం రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజినీరింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిడంలో చర్చల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కార్మిక నాయకుడు రామ్మూర్తి నాయుడు ఆరోపించారు. రాజాం మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ ఇంజినీరింగ్‌సిబ్బంది 38 రోజులుగా చేపడుతున్న నిరసన దీక్ష శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. సమస్యలను పరిష్కరించకపోతే సమ్మె తప్పదన్నారు.

దందాలు చేస్తే ఉపేక్షించేది లేదు

- బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ శరత్‌బాబు

బొబ్బిలి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా దందాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ లాలం రామలక్ష్మి సమక్షంలో రెవెన్యూ అధికారులు, సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు, ఇతర సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పట్టణ పౌరులందరికీ నాణ్యమైన, పారదర్శకమైన సేవలందించాలన్న లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. తనకు ఎటువంటి కాసుల కక్కుర్తిలేదని, ఎవరి దగ్గరా ఎటువంటి కమీషన్లను ఆశించనని స్పష్టం చేశారు. ఎవరైనా దందాలు చేస్తే ఉపేక్షించబోనని హెచ్చరించారు. మధ్యాహ్న సమయాల్లో సచివాలయాలకు తాళాలు వేసి ఉంటున్నట్లు ప్రజల నుంచి ఆరోపణలు వస్తున్నాయని, ఈ పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. రెవెన్యూ విభాగంపై వస్తున్న ఫిర్యాదుల పట్ల, సిబ్బంది పని తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది ప్రతిరోజూ కచ్చితంగా ఉదయం 8 గంటలకు విధులకు హాజరు కావాలని, లేకుంటే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు. సేవల్లో నాణ్యతను పెంచాలని సూచించారు. ఫైళ్లను పెండింగ్‌లో ఉంచుతున్న సిబ్బందిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. పట్టణంలో చెరువుల సంఖ్య, వాటి లీజు వివరాలపై తనకు నివేదిక ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఆర్వో నాగరాజు, ఆర్ఐ సురేష్‌బాబు, సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

న్యూస్ బాక్స్

ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసాచారి

సాలూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సాలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా డి.శ్రీనివాసాచారి బాధ్యతలు స్వీకరించనున్నారు. నర్సీపట్నం ఐటీఐ నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు రానున్నారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన రవికుమార్ గుంటూరు జిల్లా కేఆర్ పురం ఐటీఐకి బదిలీపై వెళ్లారు.

ఏగోటివలసలో ఏనుగులు

సీతానగరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కోటసీతారాంపురంలో తిష్టవేసిన తొమ్మిది ఏనుగులు శుక్రవారం ఏగోటివలస పంట పొలాల్లో సంచరించాయని స్థానికులు తెలిపారు. ఈ ఏనుగులు కోటసీతారాంపురంలో కె.రత్నాకర్ అనే రైతు పొలంలో మొక్కలను ధ్వంసం చేసినట్టు చెప్పారు.

డిప్యూటీ ఎంపీడీవోగా సూర్యనారాయణ

మక్కువ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ డిప్యూటీ ఎంపీడీవోగా ఎన్.సూర్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయనగరం జిల్లా బాడంగి నుంచి బదిలీపై వచ్చారు. ఇదే కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న పి.దేవకుమార్‌కు బాడంగి కార్యాలయానికి బదిలీ అయింది.

సైబర్ నేరాలపై అప్రమత్తం

వీరఘట్టం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ జి.కళాధర్ అన్నారు. శుక్రవారం ఆయన కడకెల్ల గ్రామాన్ని సందర్శించి, ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం సైబర్ మోసాలు పెరుగుతున్నాయని, ప్రజలందరూ వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎస్ఐ జి.కళాధర్, ఏఎస్ఐ కృష్ణంనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పాలకొండ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ విష్ణుమూర్తి తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేంకటేశ్వకాలనీ, జనచేతన వీధికి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఏడు గంటలకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు.

18న జాబ్‌మేళా

సాలూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సాలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 18న నిర్వహించనున్న క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌కు అర్హులందరూ హాజరుకావాలని ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కోట్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐటీఐ తోపాటు డిప్లమా, డిగ్రీ ఇతర విద్యార్హతలు గల వారు ఈ జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. హాజరైన ప్రతి విద్యార్థికి ఆఫర్ లెటర్ ఇచ్చి పంపిస్తామని ఆయన హామీ ఇచ్చారు.